మా కలం.. మీ గళం..
RNI : APTEL/ 2017/74310
# మన గళం
దిన పత్రిక
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర సంపుటి : 08 సంచిక : 216 బుధవారం 11 - 02 - 2026 పేజీలు: 8 వెల: 4

## సీఎం చంద్రబాబును కలిసిన యువ నేత శ్రీకాంత్ చౌదరి



4లో..

# విషాద ఘటన

- బైక్‌పై 10 కిలోమీటర్లు మృతదేహం తరలింపు
- అంబులెన్స్‌లు అందుబాటులో లేకపోవడంతో దిక్కుతోచని పరిస్థితి
- రూ.2000 ఆటో కిరాయి చెల్లించలేక హృదయవిదారక దృశ్యం

మన గళం, బాపట్ల జిల్లా : బాపట్ల జిల్లాలో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. కర్లపాలెం మండలం చింతాయపాలెంకు చెందిన నాగేశ్వరరావు గుండెపోటుతో మృతి చెందగా, ఆయన మృతదేహాన్ని బైక్‌పైనే సుమారు 10 కిలోమీటర్లు తరలించాల్సిన దుస్థితి ఏర్పడింది. అస్వస్థతకు గురైన నాగేశ్వరరావును బంధువులు బాపట్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వ అంబులెన్స్‌ల కోసం ప్రయత్నించినా అవి అందుబాటులోకి రాలేదని కుటుంబ సభ్యులు వాపోయారు. ప్రైవేట్ ఆటోలో మృతదేహాన్ని తరలించేందుకు రూ.2000 కిరాయి అడగడంతో, ఆ మొత్తం చెల్లించే పరిస్థితి లేక కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. చివరకు మరో మార్గం లేక మృతదేహాన్ని బైక్‌పైనే చింతాయపాలెం గ్రామానికి తరలించారు. ఈ ఘటన ప్రభుత్వ వైద్య, అత్యవసర సేవల వ్యవస్థపై తీవ్ర ప్రశ్నలు



లేవనెత్తుతోంది. అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు అందుబాటులో లేకపోవడం పేద కుటుంబాలకు ఎంతటి వేదనను మిగులుస్తుందో ఈ ఘటన కళ్లకు కట్టినట్లు చూపించింది. బాధిత కుటుంబానికి తక్షణమే సహాయం అందించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.





## 114 రఫేల్ యుద్ధ విమానాలకు
# రంగం సిద్ధం

- రూ.3.25 లక్షల కోట్ల డీల్‌కు రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం త్వరలో
- మేక్ ఇన్ ఇండియాలో 100 జెట్లు భారత వాయుసేనకు భారీ బలం

మన గళం, న్యూఢిల్లీ : భారత వాయుసేన శక్తిని మరింత పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయానికి సిద్ధమవుతోంది. మల్టీ-రోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎంఆర్‌ఎఫ్ఏ) కార్యక్రమంలో భాగంగా ఫ్రాన్స్‌కు చెందిన 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు ఈ వారంలోనే రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపే అవకాశం ఉందని సమాచారం. సుమారు రూ.3.25 లక్షల కోట్ల విలువైన ఈ ఒప్పందం భారత రక్షణ రంగ చరిత్రలోనే అతిపెద్ద డీల్‌గా నిలవనుంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్

2 లో..

# విశాఖ ఉక్కు కర్మాగారం లాభాల బాటలోకి వచ్చింది





2 లో..

- కేంద్ర ఉక్కు మంత్రితో సీఎం చంద్రబాబు భేటీ
- కేంద్రరాష్ట్ర సహకారంతో కర్మాగార పునరుజ్జీవనం
- కార్మికుల పట్టుదలతో ఉత్పాదకత పెరుగుదల

## మరో ఇద్దరు అనాథ చిన్నారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆసరా



- ప్రతి నెలా ఆర్థిక సాయం.. ఇల్లు, చదువు బాధ్యత ప్రభుత్వానిదే

పిఠాపురం, ఫిబ్రవరి 10, మన గళం, ఇటీవల తల్లిదండ్రులను కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న మరో ఇద్దరు అనాథ చిన్నారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మానవీయ ఆసరా అందించారు. పిఠాపురం నియోజకవర్గానికి చెందిన ఈ చిన్నారుల బాధ్యతను స్వయంగా తీసుకుంటూ కీలక నిర్ణయాలు ప్రకటించారు.

పిఠాపురం మండలం మాధవపురం గ్రామానికి చెందిన ఈ ఇద్దరు చిన్నారులు రెండేళ్ల క్రితం తండ్రిని, ఇటీవల తల్లిని కోల్పోయారు. నివాసం లేక, ఆర్థిక ఆసరా లేక ఇబ్బందులు పడుతున్న తమ పరిస్థితిని సామాజిక మాధ్యమాల ద్వారా వీడియో

2 లో..

## నరవణే పుస్తకంపై
# వివాదం



- లోక్‌సభలో ప్రస్తావనతో రాజుకున్న రాజకీయ వేడి
- పెంగ్విన్ ప్రకటనరాహుల్ ప్రశ్నలు

మన గళం, న్యూఢిల్లీ : మాజీ ఆర్మీ చీఫ్ ఎం.ఎం. నరవణే రచించిన ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ పుస్తకం రాజకీయంగా వివాదాస్పదంగా మారింది. ఈ పుస్తకంలోని కొన్ని అంశాలను ఇటీవల రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రస్తావించడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. దాంతో వారం రోజులుగా లోక్‌సభ కార్యకలాపాలు సజావుగా సాగడం లేదు. పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడిన రాహుల్ గాంధీ, ఈ అంశంపై నరవణే చేసిన ఓ ట్వీట్‌ను చదివి వినిపించారు. తాను రాసిన పుస్తకం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉందని, లింక్ ఓపెన్ చేస్తే

2 లో..

# రైల్వే అభివృద్ధి అంశాలపై కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతులు

- కొత్త రైల్వే లైన్ మంజూరుపై విజ్ఞప్తి
- డెమూ రైలు సర్వీస్ ప్రారంభించాలని డిమాండ్
- రైతులు, విద్యార్థులు, వ్యాపారులకు ప్రయోజనం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10,మన గళం, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని రైతులు, ఎగుమతిదారులు, వ్యాపారులు, విద్యార్థులు, సాధారణ ప్రయాణికుల ప్రయోజనార్థం రైల్వే వ్యవస్థలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి అంశాలపై ఈరోజు ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ను కలిసి వినతులు సమర్పించారు. ఈ భేటీలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా

2 లో..



# పంజాబ్‌లో ‘రిమోట్ కంట్రోల్ హత్యలు’



మన గళం డెస్క్ : పంజాబ్ రాష్ట్రంలో ‘రిమోట్ కంట్రోల్ హత్యలు’ భద్రతా వర్గాలకు పెను సవాల్‌గా మారాయి. విదేశాల్లో తలదాచుకుంటున్న గ్యాంగ్‌స్టర్లు, స్థానిక ముఠాల ద్వారా హత్యలు, బెదిరింపులు, వసూళ్లకు పాల్పడుతున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఇటీవల ఆమ్ ఆద్మీ పార్టీ కి చెందిన నేత లక్కీ ఒబెరాయ్ హత్య వెనుక కూడా విదేశీ గ్యాంగ్‌స్టర్ల నెట్‌వర్క్

2 లో..

# 114 రఫేల్ యుద్ధ విమానాలకు రంగం సిద్ధం



మాక్రాన్ భారత్ పర్యటనకు కొద్దిరోజుల ముందే ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ ఒప్పందం కేవలం యుద్ధ విమానాల కొనుగోలుకే పరిమితం కాదని రక్షణ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో భాగంగా దాదాపు 100 రఫేల్ యుద్ధ విమానాలను "మేక్ ఇన్ ఇండియా" కార్యక్రమం కింద దేశీయంగానే తయారు చేయనున్నారు. అత్యాధునిక ఫైటర్ జెట్ టెక్నాలజీ బదిలీ, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించే నిబంధనలు కూడా ఈ డీల్‌లో ఉన్నాయి. ఈ ఒప్పందం ఖరారైతే, ఫ్రాన్స్ తర్వాత అత్యధిక సంఖ్యలో రఫేల్ యుద్ధ విమానాలను వినియోగిస్తున్న దేశాలలో భారత్ ఒకటిగా నిలవనుంది.

భారత వాయుసేన వద్ద ఇప్పటికే 36 రఫేల్ 'జ' వేరియంట్ యుద్ధ విమానాలు ఉన్నాయి. 2024 డిసెంబర్‌లో చివరి రఫేల్ జెట్ వాయుసేనకు అందింది. వీటిని అంబాలాలోని 'గోల్డెన్ యారోస్' (నెం.17 స్క్వాడ్రన్), బెంగాల్‌లోని హసిమారాలో ఉన్న 'ఫాల్కన్స్' (నెం.101 స్క్వాడ్రన్)లలో మోహరించారు. వీటితో పాటు రూ.63 వేల కోట్లతో 26 నేవల్ వేరియంట్ రఫేల్-వీ యుద్ధ విమానాల కొనుగోలుకు కూడా భారత్ ఇప్పటికే ఆర్డర్ ఇచ్చింది. ఈ నేవల్ వేరియంట్ జెట్లు ఐఎన్‌ఎస్ విక్రాంత్, ఐఎన్‌ఎస్ విక్రమాదిత్య పై మోహరించనున్నారు. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ కీలక పాత్ర పోషించనుంది. రఫేల్ జెట్‌కు సంబంధించిన ఫ్యూజ్‌లేజ్ సెక్షన్లను దేశీయంగానే తయారు చేయనున్నారు. 2028 నాటికి తొలి ఫ్యూజ్‌లేజ్ సెగ్మెంట్లు సిద్ధమయ్యేలా ప్రణాళిక రూపొందించారు. నెలకు రెండు పూర్తి ఫ్యూజ్‌లేజ్‌ల తయారీ లక్ష్యంగా ఈ యూనిట్ పని చేయనుంది. అంతిమ అసెంబ్లింగ్ మాత్రం ఫ్రాన్స్‌లోని డస్సాల్ట్ ఏవియేషన్ కేంద్రంలో జరుగుతుంది.

గతేడాది మేలో పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్', అలాగే లధక్ సరిహద్దు ఉద్రిక్తతల సమయంలో రఫేల్ యుద్ధ విమానాలు తమ సత్తా చాటిన సంగతి తెలిసిందే. 250 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించే 'స్కాల్ప్' క్రూయిజ్ క్షిపణులు, మెటియోర్, హ్యామర్ వంటి శక్తిమంతమైన ఆయుధాలను మోయగల సామర్థ్యం రఫేల్‌కు ఉంది. ఈ భారీ ఒప్పందంతో భారత వాయుసేన సామర్థ్యం గణనీయంగా పెరిగి, దేశ భద్రత మరింత బలపడనుందని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# నరవణే పుస్తకంపై వివాదం

విషయాలు తెలుస్తాయని నరవణే ట్వీట్‌లో పేర్కొన్నట్లు రాహుల్ వెల్లడించారు. ఈ పుస్తకాన్ని పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా ప్రచురించినట్లు సమాచారం ఉన్నప్పటికీ, సంస్థ మాత్రం ఇప్పటివరకు పుస్తకాన్ని విడుదల చేయలేదని తాజాగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ కీలక ప్రశ్నలు లేవనెత్తారు. నరవణే అబద్ధం చెబుతున్నారా? లేక పెంగ్విన్ సంస్థ అబద్ధం చెబుతోందా? అని ప్రశ్నించారు. ప్రింట్ లేదా డిజిటల్ ఫార్మాట్‌లో పుస్తకాన్ని విడుదల చేయలేదని పెంగ్విన్ స్పష్టం చేస్తుండగా, అమెజాన్‌లో పుస్తకం అందుబాటులో ఉందని తాను చెబుతున్నట్లు రాహుల్ పేర్కొన్నారు. అయితే పెంగ్విన్ కంటే నరవణే వ్యాఖ్యలనే నమ్ముతున్నానని, నరవణే అబద్ధం చెప్పరని భావిస్తున్నానని రాహుల్ తెలిపారు. ఈ విభేదాల మధ్య నిజం ఏంటన్నది ఇప్పటికీ నిర్ధారణ కాలేదని ఆయన వ్యాఖ్యానించారు.

# పంజాబ్‌లో 'రిమోట్ కంట్రోల్ హత్యలు'

ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. గత కొన్నేళ్లుగా పంజాబ్‌లో గ్యాంగ్‌స్టర్ల ముఠాలు పేట్రేగిపోతున్నాయి. విదేశాల్లో ఉన్న ప్రధాన నేరగాళ్లు, స్థానికంగా యువకులను నియమించుకుని రాజకీయ హత్యలు, బెదిరింపులు, వసూళ్లకు పాల్పడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ ఈ గ్యాంగ్‌స్టర్ నెట్‌వర్క్‌ను ఖలిస్థాన్ అజెండాకు అనుకూలంగా మలుచుకుంటున్నట్లు సమాచారం. డ్రగ్స్ ద్వారా వచ్చిన డబ్బులో సుమారు 40 శాతం వాటాను తీసుకుని ఉగ్రవాద కార్యకలాపాలకు వినియోగిస్తున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి.

ఈ గ్యాంగ్‌స్టర్‌టెర్రర్ నెట్‌వర్క్‌పై జాతీయ దర్యాప్తు సంస్థ ఇప్పటికే విస్తృత దర్యాప్తు చేపట్టింది. ఇదే సమయంలో పంజాబ్ పోలీసులు 'ఆపరేషన్ ప్రేయర్2' పేరుతో భారీ ఆపరేషన్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి గ్యాంగ్‌స్టర్ల ఇళ్లు, రహస్య స్థావరాలపై దాడులు చేసి సుమారు 1,100 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో దాదాపు 10 వేల మంది పోలీసులు పాల్గొన్నారు. మొదటి దశ ఆపరేషన్‌లో ఇప్పటికే 3,256 మందిని అదుపులోకి తీసుకున్నామని, రాబోయే రోజుల్లో మరిన్ని దాడులు కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు. గత ఏడాది నవంబర్ నుంచి ఈ ఏడాది జనవరి మధ్య రాష్ట్రంలో ఆరు టార్గెటెడ్ హత్యలు జరగడంతో వ్యాపార వర్గాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. శాంతిభద్రతలు క్షీణించాయని ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ నెట్‌వర్క్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలు సమన్వయంతో పనిచేస్తున్నాయని అధికారులు తెలిపారు. అమెరికా, కెనడా అధికారుల సహకారంతో విదేశాల్లోని సూత్రధారులను పట్టుకునేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

# రైల్వే అభివృద్ధి అంశాలపై కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతులు

పల్నాడు జిల్లా పిడుగురాళ్ల నుంచి ప్రకాశం జిల్లా దర్శి, అద్దంకి, ఒంగోలు మీదుగా రామాయపట్నం పోర్ట్ వరకు కొత్త రైల్వే లైన్ మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. వ్యవసాయాధారిత ఈ ప్రాంతంలో ఎగుమతులకు అనుకూలమైన పంటలు, అనుబంధ ఉత్పత్తులు పెద్ద మొత్తంలో ఉత్పత్తి అవుతున్నాయని వివరించారు. ఈ రైల్వే లైన్ అమలులోకి వస్తే రామాయపట్నం పోర్ట్‌కు సరుకు రవాణా వేగవంతమవడంతో పాటు ప్రయాణికుల రాకపోకలకు సౌకర్యం కలుగుతుందని, చెన్నైసికింద్రాబాద్ మధ్య రైల్వే దూరం తగ్గి ప్రాంతీయ అనుసంధానం మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. అలాగే నడికుడిశ్రీకాళహస్తి కొత్త రైల్వే మార్గంలో సికింద్రాబాద్ నుంచి నడికుడి మీదుగా కనిగిరి వరకు ప్రయాణికుల సౌకర్యార్థం డెమూ రైలు సర్వీసును ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం సికింద్రాబాద్‌కనిగిరి మధ్య నేరుగా రైలు సర్వీస్ లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. నడికుడిశ్రీకాళహస్తి రైల్వే మార్గం ప్రారంభమైనప్పటికీ పూర్తి విద్యుదీకరణ ఇంకా జరగలేదని, ఈ నేపథ్యంలో డెమూ రైలు సర్వీస్ ప్రారంభించడం తక్షణ పరిష్కారమని తెలిపారు. భవిష్యత్తులో విద్యుదీకరణ పూర్తయ్యాక ఈ సర్వీసును మెము రైలు సర్వీస్‌గా అప్‌గ్రేడ్ చేయవచ్చని సూచిస్తూ, ఈ అంశాలపై తక్షణమే చొరవ చూపాలని కేంద్ర రైల్వే మంత్రిని కోరారు.

# విశాఖ ఉక్కు కర్మాగారం లాభాల బాటలోకి వచ్చింది

ఢిల్లీ, ఫిబ్రవరి 10 ,మన గళం,: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీలో కేంద్ర ఉక్కు శాఖా మంత్రి హెచ్ డీ కుమారస్వామిను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశాఖ ఉక్కు కర్మాగారం ప్రస్తుత స్థితిగతులు, భవిష్యత్ దిశపై సమగ్రంగా చర్చించారు. కేంద్ర ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయం, రాష్ట్ర ప్రభుత్వ మద్దతు, అలాగే కార్మికులుఉద్యోగుల అంకితభావం ఫలితంగా విశాఖ ఉక్కు కర్మాగారం లాభాల బాట పట్టిందని ముఖ్యమంత్రి వివరించారు. కష్టకాలాన్ని అధిగమించి ఉత్పాదకత పెరగడంతో పాటు ఆర్థిక స్థిరత్వం సాధించిందని పేర్కొన్నారు.

విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు అన్ని విధాలా సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. కర్మాగార అభివృద్ధి, కార్మికుల సంక్షేమం, భవిష్యత్ పెట్టుబడుల విషయంలో కేంద్రంరాష్ట్రం సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఈ భేటీలో స్పష్టం చేశారు.

# మరో ఇద్దరు అనాథ చిన్నారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆసరా

రూపంలో ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ వేదనతో స్పందించిన పవన్ కళ్యాణ్ వెంటనే సహాయక చర్యలకు ఆదేశాలు జారీ చేశారు.

ఈ చిన్నారులకు తన జీతం నుంచే ప్రతి నెలా ఒక్కొక్కరికి రూ. 5 వేల చొప్పున మొత్తం రూ. 10 వేల ఆర్థిక సాయం అందించాలని తన కార్యాలయ అధికారులను ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. అలాగే వారికి తక్షణమే నివాసం కల్పించేలా ఇల్లు మంజూరు చేయాలని సూచించారు.

అంతేకాకుండా, ఇద్దరు చిన్నారుల చదువుల బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని నిర్ణయిస్తూ, వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో చేర్పించే ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ పూర్తి బాధ్యతను కాకినాడ జిల్లా కలెక్టర్‌కు అప్పగించారు.

పిఠాపురం నియోజకవర్గంలోని ప్రజలందరినీ తన కుటుంబ సభ్యుల్లా చూసుకుంటూ, ఇప్పటికే 42 మంది అనాథ చిన్నారులకు తన జీతం మొత్తాన్ని ఆర్థిక సాయంగా అందిస్తున్న పవన్ కళ్యాణ్, ఇప్పుడు మరో ఇద్దరి బాధ్యతను స్వీకరించడం స్థానికంగా హర్షాతిరేకాలకు దారితీసింది. అవసరంలో ఉన్న వారికి తక్షణమే స్పందించి సహాయం చేయడమే తన ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి మరోసారి స్పష్టం చేశారు.



# ఆదినారాయణ రెడ్డి వ్యాఖ్యలతో పార్టీకి సంబంధం లేదు: ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్

**- ఏపీ బీజేపీలో ప్రకంపనలు - కూటమిపై 'కమ్మ' వ్యాఖ్యలతో దుమారం**
**- ఆదినారాయణ రెడ్డిని వివరణ అడుగుతాం**

అమరావతి, ఫిబ్రవరి 10,మన గళం,: ఏపీ బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపాయి. కూటమి ప్రభుత్వం ఇంకా 'కమ్మగా' ఉందని, రాష్ట్రంలో బీజేపీ లేకపోతే టీడీపీ, జనసేన కూడా లేవని, కూటమిలో బీజేపీనే ప్రధానం అన్న వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి దారితీశాయి. ఈ వ్యాఖ్యలపై ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ స్పష్టమైన వివరణ ఇచ్చారు. ఆదినారాయణ రెడ్డి వ్యాఖ్యలతో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని మాధవ్ తేల్చిచెప్పారు. బీజేపీ సమావేశంలో ఆదినారాయణ రెడ్డి మాట్లాడినప్పటికీ, ఆయన వ్యక్తిగత అభిప్రాయాలతో పార్టీ ఏకీభవించడం లేదని స్పష్టం చేశారు. కూటమి పార్టీల మధ్య ఐక్యత, సమన్వయంతోనే ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఇటువంటి వ్యాఖ్యలు పార్టీ అధికారిక వైఖరి కాదన్నారు. ఈ అంశంపై ఆదినారాయణ రెడ్డి నుంచి స్పష్టమైన వివరణ తీసుకుంటామని మాధవ్ వెల్లడించారు. కూటమిలో భాగస్వామ్య పక్షాలన్నీ పరస్పర గౌరవంతో పనిచేస్తున్నాయని, ప్రజా ప్రయోజనాలే కూటమి లక్ష్యమని తెలిపారు. వ్యక్తిగత వ్యాఖ్యల వల్ల కూటమి ఐక్యత దెబ్బతినదని, బీజేపీ తన రాజకీయ క్రమశిక్షణను కచ్చితంగా పాటిస్తుందని మాధవ్ స్పష్టం చేశారు.





మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# పెద్దారవీడు మండలంలో అధికారుల తీరుపై సర్పంచుల అసంతృప్తి

**గ్రామాభివృద్ధి పనుల్లో తమను పక్కన పెడుతున్నారని ఆరోపణలు**






మన గళం : మార్కాపురం జిల్లా ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని పెద్దారవీడు మండలంలో అధికారుల వ్యవహారశైలిపై సర్పంచులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని, పంచాయతీ తీర్మానాలు లేకుండానే అధికారులు నిర్ణయాలు తీసుకుంటున్నారని మండల సర్వసభ్య సమావేశంలో వారు గళమెత్తారు. ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య అధ్యక్షతన, ఎంపీడీవో జాన్ సుందరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో పలువురు సర్పంచులు తమ సమస్యలను ప్రస్తావించారు. గ్రామాల్లో నిర్మాణం జరుగుతున్న సీసీ రోడ్లు, పంచాయతీ భవనాలు, తాగునీటి బోర్లు వంటి అభివృద్ధి పనులు సర్పంచులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ప్రారంభిస్తున్నారని వారు ఆరోపించారు. ప్రజల చేత ఎన్నుకోబడిన తమను పట్టించుకోకుండా అధికారులే స్వయంగా నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రామాయపాలెం, కలనూతల, వైడిపాడు, స్థానికవరం గ్రామాల సర్పంచులు మాట్లాడుతూ, తాము ఎన్నో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన స్పందన లభించడం లేదన్నారు. గ్రామస్థుల నుంచి వచ్చే అభ్యర్థనలు, అవసరాలు, అభివృద్ధి ప్రణాళికలను పంచాయతీ స్థాయిలో చర్చించి తీర్మానాలు చేసి పంపించినా వాటిని పరిగణనలోకి తీసుకోవడం లేదని ఆరోపించారు. గ్రామాభివృద్ధి పనులు చేపట్టేటప్పుడు సర్పంచులకు సమాచారం ఇవ్వడం, పంచాయతీ తీర్మానాలను గౌరవించడం అధికారుల బాధ్యత అని వారు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులను పక్కనబెట్టి తీసుకునే నిర్ణయాలు గ్రామాల్లో అనవసర వివాదాలకు దారితీసే అవకాశముందని హెచ్చరించారు. ఈ పరిస్థితిపై ఉన్నతాధికారులు తక్షణమే దృష్టి సారించి, మండల అధికారులకు తగిన సూచనలు చేయాలని సమావేశంలో సర్పంచులు డిమాండ్ చేశారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రతినిధులకు సముచిత ప్రాధాన్యం ఇవ్వాలని, సమన్వయంతో పని చేస్తేనే గ్రామాల అభివృద్ధి వేగవంతం అవుతుందని వారు సూచించారు.


# మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే కోట్ల





మనగళండోన్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా విజయవాడకు ప్రయాణమవుతున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి , మార్గమధ్యంలో తమరాజు పల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదాన్ని గమనించారు. ప్రమాదంలో సిమెంట్ నగర్‌కు చెందిన ఒక పూజారి తీవ్రంగా గాయపడి రోడ్డుపై అపస్మారక స్థితిలో ఉన్న విషయాన్ని గుర్తించిన ఎమ్మెల్యే గారు, వెంటనే తన వాహనాన్ని నిలిపి సహాయక చర్యలు ప్రారంభించారు. మానవతా దృక్పథంతో స్పందించిన గౌరవ ఎమ్మెల్యే గారు ఎటువంటి ఆలస్యం చేయకుండా అంబులెన్స్‌ను పిలిపించి, గాయపడిన పూజారిని తక్షణమే సమీపంలోని ఆసుపత్రికి తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి, బాధితుడికి అత్యుత్తమ వైద్య చికిత్స అందించాలని, అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు కల్పించాలని స్పష్టంగా ఆదేశించారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, పూర్తిగా కోలుకునే వరకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని వైద్యులకు సూచించారు.అసెంబ్లీ పనుల కోసం ప్రయాణంలో ఉన్నప్పటికీ, ఒక ప్రాణాన్ని కాపాడేందుకు సమయాన్ని వెచ్చించిన ఎమ్మెల్యే మానవీయతకు స్థానిక ప్రజలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధిగా మాత్రమే కాకుండా, సామాజిక బాధ్యత కలిగిన నాయకుడిగా ఆయన చూపిన ఈ స్పందన అందరికీ ఆదర్శంగా నిలిచిందని పలువురు కొనియాడారు.

# శ్రీశైలం గాట్ రోడ్డులో పెరుగుతున్న ప్రమాదాలుడ జాగ్రత్తలతోనే భద్రత




మన గళం,పెద్ద దోర్నాల మండలం కర్నూల్ నుంచి శ్రీశైలం వెళ్లే గాట్ రహదారి ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాధాన్యం కలిగినదే అయినా, ప్రమాదాల పరంగా ఆందోళన కలిగించే మార్గంగా మారుతోంది. ఇటీవల కాలంలో ఈ మార్గంలో వరుసగా బైక్‌లు, కార్లు, బస్సులు ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు నమోదవుతున్నాయి. ముఖ్యంగా యువకులు అధిక వేగంతో బైక్‌లు నడపడం, గాట్ రోడ్ల పరిస్థితులపై అవగాహన లేకుండా ప్రయాణించడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. శ్రీశైలం గాట్ రోడ్డులో సన్నని మలుపులు, ఎత్తైన కొండచరియలు, లోతైన లోయలు ఉండటం వల్ల డ్రైవింగ్ చాలా జాగ్రత్తగా చేయాల్సిన అవసరం ఉంది. కొన్నిచోట్ల రహదారి ఇరుకుగా ఉండటం, గట్టిగా తిరిగే మలుపులు ఉండటం వల్ల చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారితీస్తోంది. వర్షాకాలంలో రాళ్లు జారిపడటం, పొగమంచు వల్ల కనిపించకపోవడం వంటి కారణాలు ప్రమాదాలను మరింత పెంచుతున్నాయి. ఇటీవల జరిగిన ప్రమాదాల్లో అధిక వేగమే ప్రధాన కారణంగా బయటపడుతోంది. కొంతమంది బైక్ రైడర్లు 6080 కిలోమీటర్ల వేగంతో గాట్ రోడ్డులో ప్రయాణించడం వల్ల మలుపుల వద్ద నియంత్రణ కోల్పోయి ప్రమాదాలకు గురవుతున్నారు. గాట్ రహదారుల్లో 20 నుంచి 40 కిలోమీటర్ల వేగం మించకపోవడం అత్యంత భద్రమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే డ్రైవర్లు కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. వాహనం బయలుదేరే ముందు బ్రేకులు, టైర్లు సరిగా ఉన్నాయా అనే విషయాన్ని చెక్ చేయాలి. మలుపుల దగ్గర వేగం తగ్గించి హారన్ ఇవ్వాలి. రాత్రి వేళల్లో గాట్ రోడ్లలో ప్రయాణం తగ్గించడం మంచిది. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం పూర్తిగా నివారించాలి. బైక్ రైడర్లు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. ఇద్దరికి మించి ప్రయాణించకూడదు. అధిక వేగం, స్టంట్లు చేయడం వంటి ప్రమాదకర చర్యలు పూర్తిగా మానుకోవాలి. ఒక్కసారి జరిగే ప్రమాదం ప్రాణాలను ప్రమాదంలో పడేస్తుందని గుర్తుంచుకోవాలి. ఈ సమస్యను తగ్గించేందుకు ప్రభుత్వ శాఖలు కూడా తమ వంతు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రమాదకర మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, గార్డ్‌రైల్స్ బలపరచడం, రహదారి మరమ్మతులు సమయానికి చేయడం వంటి చర్యలు అవసరం. ట్రాఫిక్ పోలీసులు వేగ నియంత్రణపై కఠిన చర్యలు తీసుకుంటే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంది. ప్రాణ భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అనే విషయాన్ని గుర్తుంచుకుని, జాగ్రత్తగా ప్రయాణిస్తేనే శ్రీశైలం మార్గంలో ప్రమాదాలను తగ్గించవచ్చని అధికారులు, నిపుణులు సూచిస్తున్నారు. భక్తులు సురక్షితంగా గమ్యస్థానానికి చేరాలంటే నియమాలు పాటించడం తప్పనిసరి అని అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది.

# దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి

- ఏఐటియుసి సిఐటియు ప్రజా సంఘాలు పిలుపు
- మోదీ కార్మిక ఉద్యోగ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతికటిద్దాం





మన గళం కోడుమూరు: నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు ఈనెల 12వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపు ఇవ్వడం జరిగింది ఈ సెమ్మను జయప్రదం చేయాలని స్థానిక కోడుమూరు పట్టణంలో స్టేట్ బ్యాంక్ మరియు బిఎస్ఎన్ఎల్ ఆఫీస్, పోస్ట్ ఆఫీస్. ఆంధ్ర బ్యాంక్ రాయలసీమ గ్రామీణ బ్యాంక్ అధికారులకు సమ్మెకు సంబంధించి కరపత్రాలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి బి రాజు, సిఐటియు మండల కార్యదర్శి వీరన్న ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు మధు మాట్లాడుతూ

నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ ఎజెండా మరింత నిర్ధాక్షణంగా అమలు జరపడం 2025 నవంబర్ 21 తేదీ నుండి నాలుగు కార్మిక కోడ్స్ ను అమలు చేయాలని పూనుకున్నారు ఈ కోడ్స్ వలన కార్మికులకు చాలా అన్యాయం కార్మిక నాలుగు లేబర్ కొడ్స్ అమలు అయితే కార్మికుల ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతుందని కార్మికులు యూనియన్ రిజిస్ట్రేషన్ గుర్తింపు సమిష్టి బేరా సారాల హక్కు సమ్మె హక్కు ఆందోళన చేసే హక్కు తీవ్రమైన ప్రమాదంలో పడిపోయే పరిస్థితి ఉందని అందుకనే ఈ కార్మిక వ్యతిరేక విధానానికి ఫిబ్రవరి 12 న అన్ని రంగాల కార్మికులు ఉద్యోగులు రైతులు వ్యవసాయ కూలీలు అసంఘటితరంగా కార్మికులు స్కీం వర్కర్లు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులు పెద్ద ఎత్తున ప్రతిఘటించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు భారత దేశానికి సంపదను సృష్టిస్తున్న సేవలందిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలన్నీ కార్పొరేట్లకు అప్పనంగా అప్పజెప్పడం అదాని, అంబానీ అనేక ప్రైవేట్ సంస్థలకు దేశ సంపదను కొల్లగొట్టే ఇలాంటి వారికి దొంగలకు తాళం చెవి ఇచ్చినట్లు కాదా స్వాధీనం చేయడం దేశద్రోహం చేసినట్లే అని వారు పేర్కొన్నారు రాజ్యాంగం ఇచ్చిన సార్వభౌమధికారానికి భంగం కలిగించి కార్పొరేట్లకు సామ్రాజ్యవాదులకు తొత్తులుగా మారిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రతిఘటన ఉద్యమానికి కష్టించి పని చేసే ప్రతి శ్రామికుడు ఉద్యమంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు అసంఘటిత రంగ కార్మికులైన ఆటో హమాలీ స్ట్రీట్ వండర్స్ వ్యవసాయ కూలీలు వెల్డర్స్ చికెన్ మటన్ షాపుల్లో పని చేసే వర్కర్స్ స్కూటర్ మెకానికులు స్కీం వర్కర్లైన అంగన్వాడీ, ఆశ మధ్యాహ్నం భోజన పథకం, స్కూల్ స్కావెంజర్స్,104,108 ఆరోగ్య మిత్ర, ఆర్పీలు,యానిమేటర్సు విద్యుత్తు మీటర్ రీడర్స్ కాంటాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులు మున్సిపల్ మెడికల్, ఆర్టీసీ, విద్య, ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు అనేక రంగాల్లో పనిచేసే కార్మికులందరికీ హక్కుల సాధన కోసం జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం కార్మిక హక్కులు సాధించుకుందాం. కార్మికులను శ్రమ దోపిడీ చేసే పాలకుల ప్రభుత్వాలను కూల్చే వరకు అలుపెరుగని పోరాటాలకు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు చిన్న తదితరులు పాల్గొన్నారు

# పెద్ద దోర్నాల మండలంలో ఆర్వో నీటి నాణ్యతపై ప్రశ్నలు

**– ప్రజలకు సరైన తాగునీరు అందుతున్నదా? పర్యవేక్షణ ఎవరది?**




మన గళం పెద్ద దోర్నాల మండలం : పెద్ద దోర్నాల మండలంలో గ్రామాలకు సరఫరా అవుతున్న ఆర్వో తాగునీటి నాణ్యతపై ప్రజల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు సక్రమంగా పనిచేస్తున్నాయా, ఫిల్టర్లు సమయానికి మార్చుతున్నారా, నీటి నాణ్యతను పరీక్షిస్తున్నారా అనే అంశాలపై స్పష్టత లేకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆర్వో ప్లాంట్లు ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసినప్పటికీ, కొన్నిచోట్ల నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల నీటి నాణ్యతపై ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఫిల్టర్లు సమయానికి మార్చకపోతే నీరు పూర్తిగా శుద్ధి కాకపోవడం, ప్లాంట్లలో శుభ్రత లేకపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తాగునీటి నాణ్యతను పర్యవేక్షించడం గ్రామపంచాయతీ, గ్రామ సచివాలయం, పంచాయతీ రాజ్ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ (గ్రామీణ నీటి సరఫరా) శాఖల బాధ్యతగా భావిస్తున్నారు. అధికారులు తరచూ ఆర్వో ప్లాంట్లను తనిఖీ చేసి, నీటి నమూనాలను ల్యాబ్‌లో పరీక్షించాల్సిన అవసరం ఉంది. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. నీటిలో వాసన, రుచి, రంగులో మార్పులు కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలి. గ్రామ స్థాయిలోనే ఆర్వో ప్లాంట్ల నిర్వహణపై పర్యవేక్షణ పెంచితే ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందే అవకాశం ఉంటుంది. మంచి తాగునీరు ప్రజల ఆరోగ్యానికి మూలాధారం. అందువల్ల పెద్ద దోర్నాల మండలంలో ఆర్వో నీటి నాణ్యతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు సురక్షితమైన నీరు అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


# ఏపీ మోడల్ స్కూల్ ను సందర్శించిన డీఈవో



మన గళం కోడుమూరు:కర్నూలు జిల్లా కోడుమూరు మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ లను జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్, సీ ఎం ఓ ధనరాజ్ సందర్శించారు. ఈ సందర్భంగా డి ఇ.ఓ మధ్యాహ్న భోజన పథకం పని తీరును, ఉపాధ్యాయుల హాజరును, స్టాక్ గదిని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ బోధనా పనితీరును తెలుసుకున్నారు. ఏపీ మోడల్ స్కూల్ కోడుమూరును సందర్శించి 100 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా ఇంతవరకు జరిగిన ఐదు స్లిప్ టెస్ట్ లలో సి,డి గ్రేడ్ లో ఉన్న మరియు ఎస్ఎస్సి ఫీజు కట్టి పాఠశాలకు రాని విద్యార్థులలో బాలురను డివిజన్లోని హాస్టల్ కు మరియు బాలికలను కేజీబీవీ లలో 30 రోజుల రెసిడెన్షియల్ కోచింగ్ కు విద్యార్థుల మరియు పేరెంట్స్ ల అంగీకార పత్రం గురించి తల్లిదండ్రులతో, విద్యార్థులతో మాట్లాడారు. బాలికలను అదే క్యాంపస్ లోని మోడల్ స్కూల్ హాస్టల్ లో చేర్పించారు అలాగే అధ్యాపక బృందానికి తగిన సూచనలు వారు అందించారు

## కోడుమూరు ఎంఈఓ ఆధ్వర్యంలో విద్యాంజలి 2.0 పై అవగాహన కార్యక్రమం






మన గళం కోడుమూరు: జాతీయ విద్యా విధానంబి 2020లో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విద్యాంజలి 2.0 పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల విద్యాశాఖ అధికారి జె. రామచంద్రుడు, అజారయ్య బాబు ఆధ్వర్యంలో విద్యాంజలి 2.0 (ఎఅఎఝఅయిఝశ్రీఅ) పై ఒక రోజు ఓరియెంటేషన్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది ఈ కార్యక్రమంలో విద్యాంజలి పథకం యొక్క లక్ష్యాలు, పాఠశాల అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యం, స్థానిక దాతలు మరియు స్వచ్ఛంద సేవకుల సేవల వినియోగం వంటి ముఖ్యమైన అంశాలు ప్రధానోపాధ్యాయులకు తెలియజేశారు.కాబట్టి ప్రతి పాఠశాల గ్రామాలలో స్థానిక దాతలు/స్వచ్ఛంద సేవకులను గుర్తించాలని, పాఠశాల అవసరాలను వారికి తెలియజేసి విద్యాంజలి పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. సమాజ సహకారంతో పాఠశాల అభివృద్ధి చర్యలు చేపట్టాలని అన్ని ప్రధానోపాధ్యాయులు ఈ విషయాన్ని అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని తక్షణమే అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం పాఠశాల సమాజం మధ్య వారధిగా పనిచేస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో మండల ఎంఈఓ లు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు

## శ్రీశైలం విచ్చేయు భక్తుల నడకదారిని పరిశీలిస్తున్న నంద్యాల జిల్లా కలెక్టర్







మనగళం శ్రీశైలం : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈ రోజు (10.02.2026) శ్రీశైలంలో కైలాస ద్వారం వద్ద ఉన్న నడకదారిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా గారు. ఈ సందర్భంగా నడకదారిలో భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలపై ఆరా తీసి వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ భక్తుల ఆరోగ్య భద్రత దృష్ట్యా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపుల నిర్వహణ, టాయిలెట్‌ల శుభ్రత, శుద్ధమైన మంచినీటి సరఫరా, భోజన ఏర్పాట్లు తదితర సౌకర్యాల అమలును పరిశీలించిన జిల్లా కలెక్టర్ నడకదారిలో వస్తున్న భక్తులతో నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న సదుపాయాలపై అభిప్రాయాలు, సూచనలు అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతమైన దర్శనానికి అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా కొనసాగించాలని సంబంధిత అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్

## శ్రీశైలంలో శివ స్వాములకు, భక్తులకు కనీస సౌకర్యం కల్పించలేని ప్రభుత్వం

- భక్తులకు రక్షణ ఇవ్వాల్సిన రక్షక బటులు రాక్షసుల ప్రవర్తిస్తున్నారు. - ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి.





(ఆలూరు మనగళం): ఆలూరు మండల కంద్రంలో అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి మాట్లాడుతూ, రాష్ట్ర హోంమంత్రి హిందువులు మనోభావాలు కించేపరిచే విధంగా మాట్లాడుతున్నారన్నారు. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మొన్ననే మాట్లాడుతూ శ్రీశైలం శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి లడ్డు ప్రసాదంలో కూడా కల్తీ జరిగిందంటూ అసత్య ప్రచారాలు చేస్తున్నారు. శ్రీశైలంలో శివ స్వామిలకు, భక్తులకు కనీస వసతులు త్రాగడానికి నీరు కూడా లేదని చెప్తున్నారు. శివ స్వామి భక్తుల పైన లాఠి చార్జీ చేస్తున్నారు, ఇది ఎక్కడ అన్యాయం అని అర్థం కావడం లేదు అన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నోరు తెరిస్తే సనాతన ధర్మం గురించి మాట్లాడుతారు, కానీ రాష్ట్రంలో ఇంత జరుగుతుంటే చూస్తూ ఊరుకుంటున్నారు. రాష్ట్రంలో ఉండే బిజెపి ఎమ్మెల్యే ఒక మాట కూడా మాట్లాడం లేదు. కూటమి ప్రభుత్వం తప్పు మీద తప్పు చేస్తుంది, ప్రజల్లో మిమ్మల్ని గమనిస్తూనే ఉన్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, బీవీర్ అభిమానులు పాల్గొన్నారు.


# వృద్ధ మహిళలను కాపాడిన పోలీస్ సిబ్బంది


మనగళం శ్రీశైలం : నంద్యాల జిల్లాలోని మహా పుణ్యక్షేత్రమైన శ్రీశైలం నందు జరుగుచున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేశం నలుమూలల నుండి శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి దర్శన నిమిత్తం విచ్చేసిన భక్తులతో క్యూలైన్లు దేవస్థానం పరిసర ప్రాంతాలు అత్యంత రద్దీగా ఉండడం జరిగింది. ఈ సందర్భంలో శ్రీశైల క్షేత్రం ప్రధాన ద్వారం దగ్గర కొంతమంది వృద్ధ మహిళలు అస్వస్థతకు గురై సేద తీరుచున్న సమయంలో , దీక్షలో ఉన్న శివ స్వాములు ఒక్కసారిగా గేటు ద్వారాలు తెరుచుకొని లోపలికి ప్రవేశించు సమయంలో అక్కడే విధులు నిర్వహిస్తున్న అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు గారు పరిస్థితిని గమనించి వృద్ధ మహిళలకు ఎలాంటి అపాయం జరగకుండా ఉండేందుకు శివ స్వాములు ముందుకు రాకుండా నిలువరించడం జరిగిందని ఇందులో ఎలాంటి లాఠీ ఛార్జ్ జరగలేదని తెలియజేయడం జరుగుతుంది. కావున దర్శనం నిమిత్తం విచ్చేసిన భక్తులు తొందరపడకుండా సంయమనం పాటిస్తూ పోలీస్ వారి సూచనలు అనుసరిస్తూ దర్శనం చేసుకుని సురక్షితంగా గమ్యం చేరాలని తెలియజేయడమైనది.



## ఆలూరులో రిలే దీక్షల విరమణ


- ఆదోని జిల్లా కోసం మద్దతు ఇచ్చే పార్టీలకే ప్రజల మద్దతు.
- తేల్చిచెప్పిన జె ఏ సి నాయకులు.
- జగన్ తోనే ఆదోని జిల్లా సాధ్యం.
- ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి.



(ఆలూరు మనగళం): జగన్ తోనే ఆదోని జిల్లా సాధ్యమని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు.. మంగళవారం ఆలూరు జేఏసీ ఆధ్వర్యంలో 61 రోజులుగా ఆదోని జిల్లా సాధన కోసం నిర్వహిస్తున్న రిలే దీక్షల విరమణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు మండలం కలగొట్ల గ్రామానికి వచ్చిన చంద్రబాబు నాయుడును కలిసి ఆదోని జిల్లా ఏర్పాటు కోసం వినతిపత్రం ఇస్తామని కోరినప్పటికీ పోలీసులు వారిని కలవనివ్వకుండా అరెస్టు చేయడం ఇంతవరకు సమంజసమన్నారు. ఆదోని జిల్లా కావాలని సభలో దివ్యాంగుడు వెంకటేష్ జెండా చూపిస్తే ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న చంద్రబాబు సీరియస్ బెదిరించడం సరికాదన్నారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం చూస్తే ఎల్లకాలం చంద్రబాబు సీఎంగా ఉంటారేమో అనే భావనలో ఉన్నట్లు కనిపిస్తుందన్నారు. ఆదోని జిల్లా సాధన కోసం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వద్దకు జె ఏ సి నాయకులను తీసుకెళ్లి మద్దతు ఇచ్చేలా జిల్లాలోని వైసీపీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు, మాజీ ఎమ్మెల్యేలతో కలసి కోరుతామన్నారు. కూటమినేతలకు ఆదోని జిల్లా కావడం ఇష్టం లేదని తెలుస్తుందన్నారు. వెలుకబడిన ఆలూరు ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆదోని జిల్లా అవసరం ఉందన్నారు. అనంతరం ఆదోని జేఏసీ నాయకులు రఘురామయ్య, అశోకానంద రెడ్డి, కృష్ణ మూర్తి, గోపాల్ ఆచారి,మాట్లాడుతూ కూటమిన్ నేతలను నమ్ముకొని మోసపోయమని ఇక ఆదోని జిల్లా సాధన కోసం సహకరించే పార్టీలకే ఐదు నిమిషాల ప్రజల మద్దతు ఉంటుందన్నారు.. గ్రామస్థాయిలో ఉద్యమాన్ని తీసుకెళ్లి కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా సాధన కోసం సీఎం సమావేశంలో లేవనెత్తిన కమతం వెంకటేష్ ను సన్మానించారు.. సమావేశంలో జె ఏ సి నాయకులు కత్తి రామాంజనేయులు, భూపేష్, ఎల్లప్ప, చంద్రకాంత్ రెడ్డి, పూల రామాంజనేయులు, కొట్టాల రాజు, పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు మారెప్ప పాల్, ఏసన్నా, మాదిగ దాసుల సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి నరసింహులు,రవి,మాజీ సైనికులు మహేష్, సి ఎస్ ఐ సంఘం సభ్యులు ప్రభాకర్, బుడగ జంగాల నాయకులు మహేంద్ర, మైనారిటీ నాయకులు దాదా, మార్పు సంస్థ ప్రతినిధి వేమిరెడ్డి పాల్గొన్నారు.

## జిల్లా సాధన కోసం క్రైస్తవుల ప్రార్థనలు






(ఆలూరు మనగళం): ఆదోని జిల్లా గా ప్రకటించాలంటూ ఆలూరు జె ఏ సి ఆధ్వర్యంలో చేపట్టిన 61వ రోజు రిలే దీక్షల్లో ఆలూరు తాలూకా యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ అద్వర్యంలో అధ్యక్షులు మారన్న పాల్, కోశాధికారి ఏసన్నలు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదోని జిల్లా గా ప్రకటించేందుకు సహకరించాలని మొరపెట్టుకున్నారు. జిల్లా సాధనలో మేము సైతం పోరాటానికి అండగా నిలుస్తామన్నారు.

# సంపాదకీయం

## ఆరోగ్య సమస్యగా మారుతున్న నిద్రలేమి

ఆధునిక జీవితం మనిషి జీవన విధానాన్ని పూర్తిగా మార్చేసింది. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకూ ఒక నిరంతర పరుగుల్లా జీవితం సాగుతోంది. పని ఒత్తిళ్లు, లక్ష్యాల వెనక పరుగు, ఆర్థిక బాధ్యతలు, భవిష్యత్తుపై ఆందోళనలు కలిసి మనిషి విశ్రాంతిని మెల్లగా దూరం చేస్తున్నాయి. ఒకప్పుడు శరీరం అలసినప్పుడు సహజంగా కళ్ళు మూసుకుపోయేవి. నేడు అలసట ఉన్నా నిద్ర రాకుండా మేల్కొని గడిపే రాత్రులు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితి నిద్రలేమిని వ్యక్తిగత అలవాటు సమస్యగా కాకుండా, సమాజమంతటినీ ప్రభావితం చేసే కొత్త ఆరోగ్య సమస్యగా మార్చుతోంది. నిద్రలేమి అనేది ఒక్క రాత్రి నిద్ర పట్టకపోవడం మాత్రమే కాదు. అది శరీరం, మనసు రెండింటిపైనా దీర్ఘకాలిక ప్రభావం చూపే సమస్య. సరైన నిద్ర లేకపోతే మనసు క్రమంగా అలసిపోతుంది. చిరాకు పెరుగుతుంది, చిన్న విషయాలకే కోపం వస్తుంది, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం తగ్గుతుంది. చదువులో, పనిలో ఏకాగ్రత లోపిస్తుంది. ఇవన్నీ మొదట చిన్న సమస్యలుగా కనిపించినా, కాలక్రమంలో మానసిక ఒత్తిడి, ఆందోళన వంటి పెద్ద సమస్యలకు దారి తీస్తున్నాయి.

శరీర ఆరోగ్యంపై నిద్రలేమి ప్రభావం మరింత ప్రమాదకరం. సరైన విశ్రాంతి లేకపోవడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది. రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు, మధుమేహం వంటి జీవనశైలి వ్యాధులకు నిద్రలేమి ఒక కారణంగా మారుతోందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. శరీరం రోజంతా చేసిన శ్రమ నుంచి కోలుకునే సమయం నిద్రలోనే లభిస్తుంది. ఆ అవకాశాన్ని కోల్పోతే, శరీరం లోపలినుంచి కుంగిపోతుంది.

నేటి కాలంలో నిద్రలేమికి ప్రధాన కారణంగా మారింది స్క్రీన్‌లపై పెరుగుతున్న ఆధారపడటం. రాత్రి పడుకునే ముందు మొబైల్‌లో సందేశాలు చూడడం, వీడియోలు చూడడం, సామాజిక మాధ్యమాల్లో గడపడం సాధారణ అలవాటుగా మారిపోయింది. ఈ వెలుగు కళ్ళను మాత్రమే కాదు, మనసును కూడా చురుకుగా ఉంచుతుంది. ఫలితంగా సహజ నిద్ర చక్రం భంగం అవుతోంది. పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ ఈ సమస్యకు గురవుతున్నారు. వినోదం పేరుతో మొదలైన ఈ అలవాటు, మెల్లగా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది.

ఉద్యోగ ఒత్తిళ్లు కూడా నిద్రలేమిని పెంచుతున్న ప్రధాన కారణాల్లో ఒకటి. పని పూర్తయిన తర్వాత కూడా మనసు పనినే మోసుకుపోతుంది. రేపటి లక్ష్యాలు, పనితీరు భయం, ఉద్యోగ భద్రతపై ఆందోళనలు రాత్రంతా వెంటాడుతూనే ఉంటాయి. ఇంటికి వచ్చినా మనసుకు విశ్రాంతి లభించకపోవడంతో, నిద్ర దూరమవుతోంది. దీని ప్రభావం కుటుంబ జీవితంపైనా పడుతోంది. మాటలు తగ్గుతాయి, అనుబంధాలు బలహీనపడతాయి. పిల్లలు, యువతలో నిద్రలేమి మరింత ఆందోళన కలిగించే అంశంగా మారుతోంది. చదువు ఒత్తిడి, పరీక్షల భయం, భవిష్యత్తుపై అంచనాలు వారి నిద్రను దూరం చేస్తున్నాయి. సరైన నిద్ర లేకపోవడం వల్ల వారి శారీరక ఎదుగుదల, మానసిక స్థిరత్వం దెబ్బతింటోంది. చిన్న వయసులోనే అలసట, ఒత్తిడి అలవాటుగా మారడం భవిష్యత్తుకు ప్రమాదకరం. నిద్రలేమికి పరిష్కారం మందుల్లో మాత్రమే ఉందని భావించడం తప్పు. అసలు పరిష్కారం జీవనశైలిలో మార్పు. పని, విశ్రాంతి మధ్య సమతుల్యత అవసరం. రాత్రి పడుకునే ముందు స్క్రీన్‌లకు దూరంగా ఉండే అలవాటు పెంచుకోవాలి. కుటుంబంతో మాట్లాడటం, ప్రశాంతమైన అలవాట్లు అలవరచుకోవాలి. నిద్రను విలాసంగా కాకుండా, ఆరోగ్యానికి అవసరమైన అంశంగా చూడాల్సిన ఆలోచన సమాజంలో బలపడాలి. నిద్ర అనేది సమయ వృథా కాదు. అది శరీరానికి శక్తిని తిరిగి ఇచ్చే ప్రక్రియ. మనసుకు ప్రశాంతతను అందించే సహజ ఔషధం. ఆరోగ్యానికి పునాది. నిద్రను నిర్లక్ష్యం చేసే సమాజం అనారోగ్యాన్ని ఆహ్వానించినట్టే. అందుకే నిద్రలేమిని కొత్త ఆరోగ్య సమస్యగా గుర్తించి, దానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయం వచ్చింది. విశ్రాంతి పొందిన మనసే ఆరోగ్యకరమైన వ్యక్తికి, ఆరోగ్యకరమైన సమాజానికి నిజమైన బలం. ఉద్యోగ ఒత్తిళ్లు కూడా నిద్రలేమికి కారణమవుతున్నాయి. పని పూర్తయినా మనసు పనిలోనే ఉండిపోతోంది. రేపటి లక్ష్యాలు, బాధ్యతలు, భయాలు రాత్రంతా వెంటాడుతూనే ఉంటాయి. ఇంటికి వచ్చిన తర్వాత కూడా విశ్రాంతి లభించకపోవడంతో, నిద్ర దూరమవుతోంది. ఇది కుటుంబ జీవితం, వ్యక్తిగత ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. నిద్రలేమికి పరిష్కారం మందుల్లో మాత్రమే లేదన్న విషయాన్ని సమాజం గుర్తించాల్సిన అవసరం ఉంది. జీవనశైలిలో మార్పు రావాలి. పనివిశ్రాంతి మధ్య సమతుల్యత అవసరం. పడుకునే సమయానికి ముందు స్క్రీన్ వినియోగాన్ని తగ్గించాలి. కుటుంబంతో మాట్లాడటం, మనసును ప్రశాంతంగా ఉంచే అలవాట్లు పెంచుకోవాలి. నిద్రను విలాసంగా కాకుండా, ఆరోగ్యానికి అవసరమైన అంశంగా చూడాలి. నిద్ర అనేది సమయ వృథా కాదు. అది శరీరానికి పునరుత్తేజం. మనసుకు ప్రశాంతత. ఆరోగ్యానికి పునాది. నిద్రను నిర్లక్ష్యం చేసే సమాజం అనారోగ్యాన్ని ఆహ్వానించినట్లే. అందుకే నిద్రలేమిని కొత్త ఆరోగ్య సమస్యగా గుర్తించి, దానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయం వచ్చింది. విశ్రాంతి పొందిన మనసే ఆరోగ్యకరమైన సమాజానికి బలమైన ఆధారం.


## శ్రీశైలంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన కర్నూలు రేంజ్ డీఐజీ మరియు జిల్లా ఎస్పీ...

- భక్తులు సంయమనం పాటిస్తూ దర్శనం చేసుకోవాలని భక్తులకు విజ్ఞప్తి....
- ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు భక్తులు పోలీసు వారి సూచనలు తప్పనిసరిగా పాటించాలి....





మనగళం శ్రీశైలం : జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైలం నందు జరుగుచున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారిని దర్శనం కొరకై దేశం నలుమూలల నుండి భక్తులు విచ్చేయుచున్న సందర్భంగా శ్రీశైల క్షేత్రం భక్తులతో రద్దీగా ఉండడం జరుగుతుంది. ఈ సందర్భంగా భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని శ్రీశైల క్షేత్రం నందు బందోబస్తు ఏర్పాట్లను కర్నూల్ రేంజ్ డిఐజి శ్రీ కోయ ప్రవీణ్ ఖూా గారితో పాటు నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ఖూా గారు పరిశీలించడం జరిగింది. ఇందులో భాగంగా గుడి పరిసర ప్రాంతాలు, గుడి బయట ఏర్పాటుచేసిన క్యూలైన్లు మొదలుకొని స్వామి అమ్మవారి దర్శనం అనంతరం నిష్క్రమించే మార్గం వరకు ఏర్పాటు చేసిన క్యూలైన్లను మరియు శివ స్వాములు వేచి ఉండే చంద్రావతి కళ్యాణమండపం మరియు ప్రత్యేకంగా వారికి ఏర్పాటు చేసిన క్యూలైన్లు, పార్కింగ్ ప్రదేశాలలో స్వయంగా పర్యటించడంతోపాటు జజ కెమెరాల ద్వారా భక్తుల రద్దీని వారి భక్తుల భద్రత ఏర్పాట్లను పరిశీలించడం జరిగింది. అనంతరం భద్రత దృశ్య ప్రతి ఒక్కరిని తనిఖీ చేయాలని గుడి ప్రవేశ మరియు నిష్క్రమణ ప్రాంతాలలో డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లను ( ణఖీవీణ)ఏర్పాటు చేసుకోవాలని, విధినిర్వహణలో ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని,ఏదైనా సమస్య ఉంటే వెంటనే



ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి అధికారులకు పలు సూచనలు చేయడం జరిగింది. శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి దర్శనం నిమిత్తం విచ్చేయు భక్తులు ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు పోలీసు వారి సూచనలు పాటిస్తూ తమ వాహనాలను ఇతరులకు ఆటంకం లేకుండా పార్కింగ్ ప్రదేశాలలో మాత్రమే పార్కింగ్ చేసుకోవాలని రోడ్డుకిరువైపులా వాహనాలను నిలుపు రాదని విజ్ఞప్తి చేయడం జరిగింది.

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై క్షుణ్ణ పరిశీలన

– శ్రీశైలం దేవస్థానంలో భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి – జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆదేశాలు





మనగళం శ్రీశైలం : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానానికి విచ్చేయు లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం శ్రీశైలం దేవస్థానంలో భక్తులకు కల్పిస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. దేవస్థానం ప్రారంభ ద్వారం నుండి భక్తుల క్యూ లైన్లు, క్యూ లైన్లలో ఏర్పాటు చేసిన త్రాగునీరు, అల్పాహార పంపిణీ కేంద్రాలు, శానిటేషన్ ఏర్పాట్లు తదితర అంశాలను చివరి వరకు పరిశీలించి, మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు. శివ స్వాములు విశ్రాంతి తీసుకునే చంద్రావతి కళ్యాణ మండపాన్ని సందర్శించి అక్కడ కల్పించిన సదుపాయాలపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. అలాగే గుడి వెలుపల ఉన్న క్యూ లైన్ల నుండి అమ్మవారి దర్శనం అనంతరం నిష్క్రమణ వరకు ఏర్పాటైన మార్గాలను తనిఖీ చేసి, భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అల్పాహారం, త్రాగునీరు, పారిశుధ్య ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. భద్రత పరంగా ఎలాంటి లోపాలు తలెత్తకుండా ప్రతి భక్తుడిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ప్రధాన ద్వారం నుండి దర్శనం అనంతరం నిష్క్రమణ మార్గాల వద్ద డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు (ణఖీవీణలు) ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి తెలిపారు. మహాశివరాత్రి పర్వదినాన భారీగా భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో అదనంగా చేపట్టిన ఏర్పాట్లను కూడా కలెక్టర్, ఎస్పీ పరిశీలించి అవసరమైన మార్గనిర్దేశం చేశారు. భక్తులు పోలీసు అధికారుల సూచనలను పాటిస్తూ తమ వాహనాలను ఇతరులకు ఆటంకం కలగకుండా నిర్ణీత పార్కింగ్ ప్రాంతాల్లో పార్కింగ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులు, దేవస్థాన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నడకదారిలో శ్రీశైలం వచ్చే భక్తులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి



మనగళం శ్రీశైలం : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలంలో భక్తులకు కల్పిస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీశైలంలోని కైలాస ద్వారం వద్ద ఉన్న నడకదారిని సందర్శించిన జిల్లా కలెక్టర్, పాదయాత్రగా శ్రీశైలం చేరుకుంటున్న భక్తులతో నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నడకదారిలో ఏర్పాటు చేసిన సౌకర్యాలు భక్తులకు సరిపడుగా ఉన్నాయా, ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా అనే అంశాలపై భక్తుల అభిప్రాయాలు, సూచనలు సేకరించారు. భక్తుల ఆరోగ్య భద్రత దృష్ట్యా నడకదారిలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపుల నిర్వహణ, వైద్య సిబ్బంది అందుబాటు, అత్యవసర సేవల అమలు తీరును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అలాగే టాయిలెట్ల శుభ్రత, శుద్ధమైన మంచినీటి సరఫరా, భోజన ఏర్పాట్లు, విశ్రాంతి కేంద్రాలు తదితర సౌకర్యాల అమలు పద్ధతులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి



అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు పటిష్టంగా కొనసాగించాలని, చిన్న లోపం కూడా తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నడకదారిలో భక్తులు సురక్షితంగా, సౌకర్యవంతంగా ప్రయాణించి దర్శనానికి చేరుకునేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం వచ్చే లక్షలాది భక్తులకు ఇబ్బందులు లేకుండా, ప్రశాంత వాతావరణంలో దర్శనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

# గోల్డ్, సిల్వర్ ధరలు పెరిగి వినియోగదారులకు షాక్

హైదరాబాద్ ఫిబ్రవరి 10, మనగళం : బంగారం, వెండి ధరలు మరోసారి ఒక్కసారిగా పెరిగి వినియోగదారులకు షాక్ ఇచ్చాయి. ఇటీవల ఒక రోజు స్థిరంగా ఉన్న ధరలు మళ్లీ పెరుగుదల దిశగా వెళ్లడంతో కొనుగోలుదారులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా వెండి ధర ఒక్కరోజే భారీగా పెరగడం మార్కెట్లో చర్చనీయాంశంగా మారింది.

అంతర్జాతీయ మార్కెట్లలో పసిడి ధరలు పెరగడం దేశీయ మార్కెట్లపై ప్రత్యక్ష ప్రభావం చూపుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు, డాలర్ విలువలో మార్పులు, మార్కెట్ ఒడిదుడుకులు వంటి కారణాలతో ఇన్వెస్టర్లు సురక్షిత పెట్టుబడిగా బంగారాన్ని ఎంచుకుంటుండటంతో డిమాండ్ పెరిగి ధరలు ఎగబాకుతున్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1310 పెరిగి రూ.1,57,910కు చేరింది. అలాగే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ.1200 పెరిగి రూ.1,44,750గా నమోదైంది. వెండి ధర కూడా భారీగా పెరిగి ఒక్కరోజే కిలోకు రూ.15,000 పెరిగి ప్రస్తుతం రూ.3,00,000 వద్ద ట్రేడవుతోంది. మార్కెట్ పరిస్థితులను బట్టి రోజులో ఏ సమయంలోనైనా ధరల్లో మార్పులు



ఉండే అవకాశం ఉన్నందున కొనుగోలుదారులు స్థానిక మార్కెట్‌లో తాజా రేట్లు తెలుసుకుని కొనుగోలు చేయడం మంచిదని వ్యాపార వర్గాలు సూచిస్తున్నాయి.

# రూ.49కే 25 డేటాడ జియో అదిరిపోయే డేటా బూస్టర్ ప్లాన్

ముంబై ఫిబ్రవరి 10 మనగళం : ప్రముఖ టెలికాం సంస్థ రిలయన్స్ జియో తన వినియోగదారుల కోసం మరో ఆకర్షణీయమైన డేటా బూస్టర్ ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. తక్కువ ధరలో ఎక్కువ డేటా కావాలనుకునే యూజర్లను దృష్టిలో ఉంచుకుని ఈ కొత్త వోచర్‌ను రూపొందించింది. ప్రస్తుతం పెరుగుతున్న డేటా వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని తీసుకొచ్చిన ఈ ప్లాన్ టెలికాం మార్కెట్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ డేటా బూస్టర్ ప్లాన్ ధర కేవలం రూ.49 మాత్రమే. ఈ ప్లాన్ ద్వారా వినియోగదారులు 25 హై-స్పీడ్ డేటాను పొందవచ్చు. అయితే ఈ ప్లాన్ గడువు కేవలం ఒక్కరోజు మాత్రమే ఉండటం గమనించాల్సిన విషయం. ఒకవేళ వినియోగదారు 25 డేటా మొత్తాన్ని ఉపయోగించిన తర్వాత ఇంటర్నెట్ వేగం 64ఖఎజూంకి తగ్గుతుంది. అయినప్పటికీ తక్కువ సమయంలో ఎక్కువ డేటా అవసరమయ్యే వారికి ఇది మంచి ఆప్షన్‌గా భావిస్తున్నారు. ఈ వోచర్ పూర్తిగా డేటా అవసరాల కోసం మాత్రమే రూపొందించబడింది. ఇందులో కాలింగ్ లేదా ఎస్ఎంఎస్ వంటి అదనపు ప్రయోజనాలు ఉండవు. అలాగే ఈ డేటా ప్యాక్‌ను ఉపయోగించాలంటే వినియోగదారుడి మొబైల్ నంబర్‌పై ఇప్పటికే యాక్టివ్ బేస్ ప్లాన్ ఉండాలి. బేస్ ప్లాన్ లేకుండా ఈ వోచర్ పనిచేయదు. ప్రస్తుతం ఓటీటీ కంటెంట్ వీక్షణ, ఆన్‌లైన్ గేమింగ్, పెద్ద ఫైల్స్ డౌన్‌లోడ్, వీడియో కాల్స్ వంటి కారణాలతో డేటా వినియోగం పెరుగుతున్న




నేపథ్యంలో ఈ ప్లాన్ వినియోగదారులకు ఉపయోగపడే అవకాశముందని టెలికాం వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఒకరోజు ఎక్కువ డేటా అవసరమయ్యే సందర్భాల్లో సినిమాలు చూడడం, లైవ్ స్ట్రీమింగ్ చేయడం లేదా ఆఫీస్ పనుల కోసం పెద్ద ఫైల్స్ డౌన్‌లోడ్ చేయడం వంటి సందర్భాల్లో ఈ ప్లాన్ మంచి ఎంపికగా నిలుస్తుందని వినియోగదారులు అభిప్రాయపడుతున్నారు.

# ఆటో రంగంలో భారత్‌కు బిగ్ బూస్ట్.. చైనాకు షాక్

న్యూఢిల్లీ ఫిబ్రవరి 10 ,మనగళం :భారత్‌అమెరికా మధ్య కుదిరిన తాజా వాణిజ్య ఒప్పందం దేశీయ ఆటోమొబైల్ రంగానికి భారీ ఊతం ఇవ్వనుందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా ఆటో భాగాలపై అమెరికా విధిస్తున్న సుంకాలను గణనీయంగా తగ్గించడం వల్ల భారత కంపెనీలకు ఎగుమతుల్లో పెద్ద అవకాశాలు కలగనున్నాయి. ఇదే సమయంలో చైనా ఆటో ఉత్పత్తులపై ఉన్న అధిక సుంకాల కారణంగా ఆ దేశానికి పోటీ ఒత్తిడి పెరిగే అవకాశముందని విశ్లేషకులు అంటున్నారు.ఈ ఒప్పందం ప్రకారం భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే కొన్ని ఆటో భాగాలపై ఉన్న 50 శాతం వరకు సుంకాన్ని 18 శాతానికి తగ్గించారు. కొన్ని ఉత్పత్తులకు డ్యూటీ మినహాయింపు కూడా కల్పించారు. దీంతో భారత ఆటో భాగాల ధరలు అమెరికా మార్కెట్లో పోటీగా మారనున్నాయి. తయారీ వ్యయం తక్కువగా ఉండటం భారత కంపెనీలకు అదనపు ప్రయోజనంగా మారనుంది.ఇదే సమయంలో భారత్ కూడా కీలక నిర్ణయాలు తీసుకుంది. 800 సిసి నుంచి 1600 సిసి వరకు ఉన్న అమెరికన్ బైకులపై ఇంపోర్ట్ డ్యూటీని పూర్తిగా రద్దు చేసింది. అలాగే 3000 సిసి ఇంజిన్ కలిగిన అమెరికన్ కార్లపై ప్రస్తుతం ఉన్న 110 శాతం కస్టమ్స్ డ్యూటీని వచ్చే 10 సంవత్సరాల్లో 30 శాతానికి తగ్గించేందుకు అంగీకరించింది. ఈ నిర్ణయాలతో భారత మార్కెట్లో ప్రీమియం అమెరికన్ వాహనాల ప్రవేశం పెరగనున్నట్లు అంచనా.ప్రస్తుతం అమెరికా మార్కెట్లో చైనా ఆటో ఉత్పత్తులపై సుమారు 40 శాతం వరకు సుంకాలు కొనసాగుతున్నాయి. అదే సమయంలో భారత ఉత్పత్తులపై సుంకం తగ్గడం వల్ల ధరల పరంగా భారత కంపెనీలు ముందంజలో నిలిచే అవకాశం ఉంది. దీంతో అమెరికా మార్కెట్లో చైనా కంపెనీలతో పోలిస్తే భారత కంపెనీలకు




పోటీలో ఆధిక్యం దక్కే పరిస్థితి ఏర్పడుతోంది.

ఈ ఒప్పందం వల్ల భారత్‌కు చెందిన ఆటో మరియు ఆటో భాగాల కంపెనీలకు ఎగుమతులు పెరగడం, లాభాల మార్జిన్ మెరుగుపడడం, అంతర్జాతీయ మార్కెట్లో స్థానం బలపడడం వంటి ప్రయోజనాలు కలగనున్నాయి. భారత్ ఫోర్జ్, సోనా బీఎల్డబ్ల్యూ ప్రెసిషన్ ఫోర్జింగ్స్, రామ్‌కృష్ణ ఫోర్జింగ్స్, బాలకృష్ణ ఇండస్ట్రీస్ వంటి కంపెనీలు ఈ మార్పులతో లాభపడే అవకాశముందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అలాగే హార్లే డేవిడ్సన్ భాగస్వామ్యంతో హీరో మోటోకార్ప్ ప్రీమియం బైక్ విభాగంలో మరింత బలపడే అవకాశం ఉందని విశ్లేషణలు సూచిస్తున్నాయి.

# పోస్టాఫీస్ అద్భుత పథకం.. నెలనెలా రూ.17 వేల ఆదాయం

న్యూఢిల్లీ ఫిబ్రవరి 10 ,మనగళం : రిటైర్మెంట్ తర్వాత ఆర్థిక భద్రత ప్రతి ఒక్కరికీ ముఖ్యమైన అంశం. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, మారుతున్న మార్కెట్ పరిస్థితుల్లో పెట్టుబడులు సురక్షితంగా ఉండటంతో పాటు స్థిరమైన ఆదాయం రావాలని చాలామంది ఆశిస్తున్నారు. అలాంటి సీనియర్ సిటిజన్ల కోసం పోస్టాఫీస్ అందిస్తున్న సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ూజుూూ) ప్రస్తుతం మంచి ఆదరణ పొందుతోంది. ప్రభుత్వ హామీ ఉండటంతో రిస్క్ లేకుండా స్థిరమైన వడ్డీ అందించే పథకంగా ఇది నిలుస్తోంది.

ప్రస్తుతం ఈ పథకంపై ప్రభుత్వం 8.2 శాతం వడ్డీని అందిస్తోంది. ఇది అనేక బ్యాంకులు ఇచ్చే ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్ల కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. పెట్టుబడిదారులకు సురక్షితమైన ఆదాయం అందించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. ముఖ్యంగా మధ్యతరగతి వృద్ధులు, రిటైర్డ్ ఉద్యోగులు ఈ పథకంపై ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.

నెలకు రూ.17 వేల ఆదాయం ఎలా?

ఈ పథకంలో గరిష్ఠంగా ఒక వ్యక్తి రూ.30 లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు. ఉదాహరణకు రూ.25 లక్షలు పెట్టుబడి పెడితే 8.2 శాతం వడ్డీ ప్రకారం ఏడాదికి సుమారు రూ.2,05,000 వరకు వడ్డీ లభిస్తుంది. అంటే నెలకు సగటున రూ.17,083 వరకు ఆదాయం పొందే అవకాశం ఉంటుంది. ఈ వడ్డీని ప్రతి మూడు నెలలకు ఒకసారి ఖాతాలో జమ చేస్తారు. అంటే మూడు నెలలకు సుమారు రూ.51,250 వరకు పొందవచ్చు.

అర్హతలు ముఖ్య వివరాలు

ఈ పథకాన్ని కనీసం రూ.1,000తో ప్రారంభించవచ్చు. సాధారణంగా 60 ఏళ్లు పూర్తైన వారు అర్హులు. అయితే స్వచ్ఛంద పదవీ విరమణ (ఎూూ) తీసుకున్న వారు 55 నుంచి 60 ఏళ్ల మధ్య, రిటైర్డ్ రక్షణ సిబ్బంది 50 ఏళ్ల తర్వాత కూడా ఇందులో చేరే అవకాశం ఉంది. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80జ కింద ఏడాదికి రూ.1.5 లక్షల వరకు పన్ను మినహాయింపు పొందవచ్చు.

ఈ పథకం కాలపరిమితి 5 సంవత్సరాలు. గడువు పూర్తైన తర్వాత మరో 3 సంవత్సరాల పాటు పొడిగించుకునే అవకాశం కూడా ఉంది. అవసరమైతే నిబంధనల ప్రకారం కొంత జరిమానా చెల్లించి ముందుగానే ఖాతాను మూసివేయవచ్చు. ఖాతాదారుడు మరణించిన సందర్భంలో మొత్తం డబ్బు వడ్డీతో సహా నామినీకి అందజేస్తారు.

రిటైర్మెంట్ తర్వాత స్థిరమైన ఆదాయం పొందుతూ ఎవరిపైనా ఆధారపడకుండా జీవించాలనుకునే వారికి పోస్టాఫీస్ సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ మంచి ఆర్థిక భరోసాగా నిలుస్తోంది.

## భారత ఆదాయపు పన్ను వ్యవస్థలో భారీ మార్పులు




న్యూఢిల్లీ ఫిబ్రవరి 10 మనగళం : భారతదేశంలో ఆదాయపు పన్ను విధానంలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. కేంద్ర ఆదాయపు పన్ను శాఖ ఈ ఏడాది మార్చి తొలి వారంలో కొత్త ఆదాయపు పన్ను నియమాలు ( 2026) మరియు పన్ను రిటర్న్ ఫారాలను విడుదల చేయడానికి సిద్ధమవుతోంది. ప్రస్తుతం అమల్లో ఉన్న 1961 ఆదాయపు పన్ను చట్టానికి బదులుగా తీసుకువస్తున్న కొత్త 2025 అమలుకు ఇది ముందస్తు చర్యగా భావిస్తున్నారు. కొత్త చట్టం 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. పన్ను చట్టాలను సాధారణ పన్ను చెల్లింపుదారులకు సులభంగా అర్థమయ్యేలా మార్చడం, క్లిష్టమైన భాషను సరళీకృతం చేయడం, డిజిటల్ విధానాలను విస్తరించడం ఈ మార్పుల ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంటోంది. కొత్త నియమాలను ముందుగానే ప్రకటించడం ద్వారా పన్ను చెల్లింపుదారులు మార్పులకు అలవాటు పడేందుకు సమయం కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

కొత్త చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత 202728కు సంబంధించిన ఆదాయపు పన్ను రిటర్న్లు 2027 జూలైలో దాఖలు చేయాల్సి ఉంటుంది. అయితే 202627 నుంచే అడ్వాన్స్ ట్యాక్స్, ఀఘూ మరియు ఇతర పన్ను సంబంధిత ప్రక్రియలు కొత్త నియమాల ప్రకారం అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ఉద్యోగులకు అందించే కార్లు, ఇతర సౌకర్యాలపై విధించే పన్ను లెక్కింపులో కూడా మార్పులు ఉండొచ్చని సమాచారం.

ఇంకా ఒక ముఖ్యమైన మార్పుగా ఆదాయపు పన్ను రిటర్న్ ఫైలింగ్ పూర్తిగా టెక్నాలజీ ఆధారితంగా మారనుంది. జీతం, బ్యాంకు వడ్డీ ఆదాయం, డిడక్షన్లు వంటి వివరాలు ఆటోమేటిక్‌గా ఫారాల్లో ముందే నింపబడే విధంగా వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నారు. దీంతో పొరపాట్లు తగ్గి, రిటర్న్ దాఖలు ప్రక్రియ వేగవంతం అవుతుందని అధికారులు చెబుతున్నారు.

డ్రాఫ్ట్ నియమాలపై ప్రస్తుతం ప్రజాభిప్రాయ సేకరణ కొనసాగుతోంది. ఫిబ్రవరి 22, 2026 వరకు పన్ను నిపుణులు, సలహాదారులు, సాధారణ పన్ను చెల్లింపుదారుల నుంచి సూచనలు స్వీకరిస్తున్నారు. వచ్చిన సూచనలను పరిశీలించిన తర్వాత తుది నియమాలను ప్రకటించనున్నారు. ప్రస్తుతం ఉన్న ఆదాయపు పన్ను ఫారాలు 202526 వరకు యథావిధిగా కొనసాగనున్నాయి. కొత్త చట్టం అమలుతో దశలవారీగా కొత్త విధానం పూర్తిస్థాయిలో అమల్లోకి రానుంది.

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



ముంబై ఫిబ్రవరి 10 మనగళం : దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు కూడా లాభాల్లోనే ముగిశాయి. మంగళవారం జరిగిన ట్రేడింగ్‌లో ప్రముఖ కంపెనీల మూడో త్రైమాసిక (ఉ3) ఫలితాలు అంచనాలను మించడంతో పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలు, విదేశీ పెట్టుబడిదారుల కొనుగోళ్లు మార్కెట్‌కు బలంగా నిలిచాయి. దీంతో బీఎస్ఈ సెన్సెక్స్ 208 పాయింట్లు పెరిగి 84,065 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 67 పాయింట్లు లాభపడి 25,935 స్థాయికి చేరుకుంది. ట్రేడింగ్ సెషన్ మొత్తం కొనుగోళ్ల జోరు కొనసాగడం గమనార్హం. ప్రధాన సూచీలతో పోలిస్తే బ్రాడర్ మార్కెట్లు మరింత మెరుగైన ప్రదర్శన కనబర్చాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.49 శాతం లాభపడగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.38 శాతం పెరిగింది. ముఖ్యంగా మైక్రోక్యాప్ షేర్లలో కొనుగోళ్లు పెరగడం చిన్న పెట్టుబడిదారుల ఆసక్తి పెరుగుతోందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. డిసెంబర్ త్రైమాసిక ఫలితాలు ఆశాజనకంగా రావడంతో నిఫ్టీ మైక్రోక్యాప్ 250 సూచీ సుమారు 1 శాతం పెరిగింది. దీర్ఘకాల పెట్టుబడిదారులు ఈ విభాగంపై మరింత దృష్టి సారిస్తున్నట్లు ట్రేడింగ్ ధోరణులు సూచిస్తున్నాయి. రంగాల వారీగా పరిశీలిస్తే ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్ రంగాలను మినహాయించి మిగతా అన్ని రంగాలు లాభాల్లోనే ట్రేడ్ అయ్యాయి. నిఫ్టీ మీడియా సూచీ 2.40 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలవగా, ఆటో రంగం 1.37 శాతం లాభంతో మంచి ఊపును చూపింది. ఐటీ, ఎఫ్ఎంసీజీ, మెటల్ రంగాల్లో కూడా కొనుగోళ్లు కనిపించాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు కొనుగోళ్లు కొనసాగించడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచింది. ఇక కరెన్సీ మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి 0.23 శాతం బలపడి 90.52 వద్ద ముగిసింది. అయితే బ్యాంకింగ్ రంగంలో స్వల్ప ఒత్తిడి కనిపించడంతో నిఫ్టీ బ్యాంక్ సూచీ 60,626.40 వద్ద స్వల్ప నష్టంతో ముగిసింది. మొత్తంగా కంపెనీల ఫలితాలు, గ్లోబల్ సంకేతాలు అనుకూలంగా ఉండటంతో మార్కెట్‌లో సానుకూల ధోరణి కొనసాగుతున్నట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# 'రౌడీ జనార్దన'తో కీర్తి సురేశ్ సందడి



**ఖుషీ అవుతున్న ఫ్యాన్స్**

హైదరాబాద్ ఫిబ్రవరి 10 : మన గళం, : హీరోయిన్‌గా తక్కువ సమయంలోనే స్టార్‌డమ్ అందుకున్న కీర్తి సురేశ్ మరోసారి టాలీవుడ్‌లో సందడి చేయడానికి సిద్ధమవుతోంది. 'దసరా' సినిమా తర్వాత తెలుగులో పెద్దగా ప్రాజెక్టులు చేయని ఆమె, ప్రస్తుతం తమిళ సినిమాలపైనే ఎక్కువగా దృష్టి పెట్టిన సంగతి తెలిసిందే. దీంతో తెలుగులో ఆమె నుంచి కొత్త సినిమా ఎప్పుడు వస్తుందా అని అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయ్ దేవరకొండ సరసన 'రౌడీ జనార్దన' సినిమాలో నటించేందుకు కీర్తి సురేశ్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విజయ్ దేవరకొండ కీర్తి సురేశ్ జోడీ తొలిసారి తెరపై కనిపించనుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై ఒక్కసారిగా బజ్ పెరిగింది. తెరపై ఈ జోడీ కొత్త ఫ్రెష్ ఫీల్ ఇస్తుందని అభిమానులు భావిస్తున్నారు. 'దసరా' తర్వాత తెలుగులో సరైన హిట్ రాకపోవడంతో కీర్తి సురేశ్ ఎంపికలపై అభిమానుల్లో కొంత అసంతృప్తి కనిపించినప్పటికీ, ఈ సినిమా ఆమెకు మంచి కమ్బ్యాక్ అవుతుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ చిత్రంలో నటుడు రాజశేఖర్ కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమాను డిసెంబర్‌లో విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. విజయ్ దేవరకొండకు, కీర్తి సురేశ్‌కు ఈ సినిమా మరో విజయాన్ని అందిస్తుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.




# 'టాక్సిక్'కు లీగల్ షాక్... చెట్ల నరికివేత ఆరోపణలపై ఎఫ్ఐఆర్


బెంగళూరు ఫిబ్రవరి 10 మన గళం, : కన్నడ స్టార్ హీరో యష్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' మరోసారి వివాదాల్లో చిక్కుకుంది. బెంగళూరులోని పీణ్యజలహళ్లి సమీప అటవీ ప్రాంతంలో సినిమా షూటింగ్ సమయంలో అనుమతి లేకుండా చెట్లు నరికివేశారనే ఆరోపణలు నిజమని కర్ణాటక అటవీ శాఖ తేల్చడంతో నిర్మాతలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు సమాచారం. షూటింగ్ యూనిట్‌తో పాటు భూమిని లీజుకు ఇచ్చిన వ్యక్తులపైనా కేసులు నమోదైనట్లు తెలుస్తోంది.

'కేజీఎఫ్' సిరీస్ తరువాత యష్ నుంచి వస్తున్న చిత్రం కావడంతో 'టాక్సిక్'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. మలయాళ దర్శకురాలు గీతు మోహన్‌దాస్ దర్శకత్వంలో డార్క్, ఇంటెన్స్ టోన్‌తో ఈ చిత్రం రూపొందుతోంది. కథనం, విజువల్స్ పరంగా కొత్త అనుభూతి అందించేందుకు అంతర్జాతీయ స్థాయి టెక్నిషియన్లతో పని చేస్తున్నట్లు చిత్రబృందం ఇప్పటికే వెల్లడించింది. టీజర్‌లో యష్ డిఫరెంట్ లుక్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించింది.

ఈ చిత్రంలో కియారా అద్వానీ, నయనతార, తారా సుతారియా, రుక్మిణి వసంత్ వంటి నటీమణులు కీలక పాత్రల్లో కనిపించనుండగా, హుమా ఖురేషి, నటాలీ బర్న్ కూడా ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్లు, క్యారెక్టర్ విజువల్స్ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి.

అయితే తాజాగా అటవీ భూమిలో అనుమతుల పరిమితిని దాటి చెట్లు నరికివేయడం చట్టవిరుద్ధమని అటవీ శాఖ స్పష్టం చేసింది. అటవీ శాఖ మంత్రి ఆ ప్రాంతాన్ని సందర్శించి ఫొటోలు సోషల్ మీడియాలో పంచుకోవడంతో వివాదం మరింత ముదిరింది. అనంతరం అధికారికంగా ఎఫ్ఐఆర్ నమోదు కావడం సినీ వర్గాల్లో సంచలనంగా మారింది. తాజా లీగల్ సమస్య సినిమా విడుదలపై ప్రభావం చూపుతుందా లేదా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారగా, అభిమానులు మాత్రం 'టాక్సిక్' విడుదల కోసం ఎదురుచూస్తున్నారు.

# విశ్వక్ సేన్ అనుదీప్ 'ఫంకీ'కి సెన్సార్ క్లియర్... ఫిబ్రవరి 13న రిలీజ్




హైదరాబాద్ ఫిబ్రవరి 10 ,మన గళం: మాస్ కా దాస్ విశ్వక్ సేన్, 'జాతిరత్నాలు' ఫేమ్ అనుదీప్ కేవీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న క్రేజీ ఎంటర్‌టైనర్ 'ఫంకీ' విడుదలకు సిద్ధమైంది. ఫిబ్రవరి 13న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానున్న ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని సర్టిఫికేట్‌ను పొందింది. సినిమా రన్‌టైమ్‌ను 128 నిమిషాలుగా ఖరారు చేసినట్లు మేకర్స్ వెల్లడించారు.

ఇండస్ట్రీ నేపథ్యంలో సాగే సెటైరికల్ కామెడీగా రూపొందిన ఈ చిత్రంలో విశ్వక్ సేన్ ఫిల్మ్ డైరెక్టర్ పాత్రలో కనిపించనుండగా, కయాదు లోహర్ కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే విడుదలైన 'యమ యమ్మ' పాట, ఫన్నీ ట్రైలర్ ప్రేక్షకుల్లో మంచి స్పందనను దక్కించుకుని సినిమాపై అంచనాలను పెంచాయి. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ 4 సినిమాస్ సంయుక్తంగా నిర్మించాయి. వాలెంటైన్స్ వీకెండ్ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానున్న 'ఫంకీ' పూర్తి స్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా అలరించనుందని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తోంది.

# ఓటీటీలో ఐశ్వర్య రాజేశ క్రైమ్ థ్రిల్లర్ 'ప్లాన్ బి'కి మళ్లీ క్రేజ్

హైదరాబాద్ ఫిబ్రవరి 10,మన గళం: తమిళ, తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు పొందిన హీరోయిన్ ఐశ్వర్య రాజేశ్ సినిమాలకు ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లలో ప్రత్యేక ఆదరణ కొనసాగుతోంది. ఆమె ఎంచుకునే కథలు, పాత్రల్లో సహజమైన నటన కారణంగా ఆమె సినిమాలను మళ్లీ మళ్లీ చూసే ప్రేక్షకులు ఉన్నారు. 'ఫర్హానా', 'డ్రైవర్ జమున', 'సొపన సుందరి', 'రన్ బేబీ రన్' వంటి చిత్రాల సరసన ఇప్పుడు 'ప్లాన్ బి' (థిట్టమ్ ఇరాండు) కూడా ఓటీటీలో మంచి స్పందన పొందుతోంది.

2021లో రూపొందిన ఈ చిత్రం క్రైమ్ థ్రిల్లర్ జోనర్‌లో సాగుతుంది. 'థిట్టమ్ ఇరాండు' అంటే 'రెండో వ్యూహం' అనే అర్థం ఉండగా, ఓటీటీలో 'ప్లాన్ బి' పేరుతో కూడా అందుబాటులో ఉంది. ఈ సినిమాలో ఐశ్వర్య రాజేశ్ పోలీస్ అధికారిగా కనిపిస్తూ కథను ముందుకు నడిపిస్తుంది. కథ ప్రకారం, కొత్తగా విధుల్లో చేరిన పోలీస్ ఆఫీసర్ అధీరా చిన్ననాటి స్నేహితురాలు అదృశ్యమవ్వడంతో కేసు విచారణ ప్రారంభిస్తుంది. అనంతరం కాలిపోయిన కారులో ఆమె మృతదేహం లభించడం కేసును మరింత మిస్టరీగా మారుస్తుంది. బాధితురాలి భర్తకు శత్రువులు లేరని చెప్పడంతో కేసు మరింత క్లిష్టంగా మారుతుంది. చివరికి ఈ మిస్టరీని అధీరా ఎలా ఛేదిస్తుంది అనేదే కథాంశం. అనూహ్యమైన ట్విస్ట్‌తో సాగే ఈ సినిమా క్రైమ్ థ్రిల్లర్‌లను ఇష్టపడే ప్రేక్షకులు ఓటీటీలో తప్పకుండా చూడదగిన చిత్రంగా నిలుస్తోంది.



# సీఎం చంద్రబాబును కలిసిన యువ నేత శ్రీకాంత్ చౌదరి





మన గళం,ఎమ్మిగనూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను ఆదోని తెలుగుదేశం యువ నాయకుడు శ్రీకాంత్ చౌదరి కలిశారు.ఇటీవల ఎమ్మిగనూరులో పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను శ్రీకాంత్ చౌదరి ప్రత్యేకంగా కలిసి పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన అంశాలన్నీ కూడా చంద్రబాబు నాయుడు కు తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. పార్టీ కోసం ప్రతి కార్యకర్త సైనికులుగా కృషి చేయాలని ఆయన తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలన్నీ కూడా ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. శ్రీకాంత్ చౌదరి చేస్తున్న పార్టీ సేవలకు చంద్రబాబు నాయుడు ఆయన్ను ప్రశంసించారు. రాబోయే కాలంలో కూడా పార్టీ కోసం ఇలాగే కృషి చేయాలని శ్రీకాంత్ కు సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు.

# టీ20 వరల్డ్ కప్

- కూనల పోరులో నెదర్లాండ్స్ ఘన విజయం



ఢిల్లీ ఫిబ్రవరి 10,మన గళం : టీ20 ప్రపంచకప్ 2026లో నెదర్లాండ్స్ జట్టు అద్భుత ప్రదర్శనతో విజయాన్ని సొంతం చేసుకుంది. గ్రూప్-ఏలో భాగంగా మంగళవారం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో నమీబియాపై 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆల్‌రౌండర్ బాస్ డి లీడ్ బంతితోనూ, బ్యాట్‌తోనూ రాణిస్తూ జట్టు విజయానికి ప్రధాన కారణమయ్యాడు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన నమీబియా జట్టు, నెదర్లాండ్స్ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు తట్టుకోలేకపోయింది. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 156 పరుగులకే పరిమితమైంది. జాన్ నికోల్ లాఫ్టీ-ఈటన్ 42 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అయితే మిగతా బ్యాటర్లు మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచడంలో విఫలమయ్యారు. నెదర్లాండ్స్ బౌలర్లలో బాస్ డి లీడ్, లోగాన్ వాన్ బీక్ చెరో రెండు వికెట్లు తీసి ప్రత్యర్థి జట్టును అదుపులో పెట్టారు.

157 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నెదర్లాండ్స్ జట్టుకు బాస్ డి లీడ్ అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 48 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో అజేయంగా 72 పరుగులు చేసి మ్యాచ్‌ను ఏకపక్షంగా మలిచాడు. కోలిన్ అకెర్‌మాన్ (32)తో కలిసి మూడో వికెట్‌కు 70 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. చివర్లో కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ (18 నాటౌట్) వేగంగా ఆడటంతో నెదర్లాండ్స్ జట్టు మరో రెండు ఓవర్లు మిగిలి ఉండగానే, 18 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది.

ఈ విజయంతో నెదర్లాండ్స్ టోర్నీలో శుభారంభం చేసింది. వికెట్ల పరంగా టీ20 ప్రపంచకప్ చరిత్రలో డచ్ జట్టుకు ఇదే అతిపెద్ద విజయంగా నిలిచింది. మరోవైపు నమీబియా తన తదుపరి మ్యాచ్‌లో గురువారం ఇదే వేదికపై డిఫెండింగ్ ఛాంపియన్ భారత్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌పై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

# అంతర్జాతీయ స్థాయిలో ఆలూరు మధుకు స్వర్ణ పథకం

రాష్ట్రానికి, కర్నూలు జిల్లాకు గర్వకారణం.







(ఆలూరు మనగళం): శ్రీలంక రాజధాని కొలంబోలో ఈనెల 6న జరిగిన దక్షిణాసియా సెపక్ తక్రా పోటీల్లో ఆలూరుకు చెందిన మధు ప్రతిభ చాటారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో బంగారు పతకం సాధించి దేశానికి ఆంధ్ర రాష్ట్రానికి, కర్నూలు జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. స్వర్ణ పథకం దైవసం చేసుకున్న మధును క్రీడ అభిమానులు, స్థానికులు అభినందనలతో ముంచెత్తారు. ఆయన సాధించిన విజయం ప్రాంతీయ యువతకు, ఎంతో ప్రేరణగా నిలుస్తుందని పలువురు క్రీడాకారులు కొనియాడారు.

# భారత్ మ్యాచ్‌పై పాక్ యూటర్న్..

ముంబై ఫిబ్రవరి 10,మన గళం, : టీ20 ప్రపంచకప్‌లో భారత్‌తో మ్యాచ్ ఆడే విషయంలో పాకిస్థాన్ తీసుకున్న యూటర్న్‌పై టీమిండియా మాజీ క్రికెటర్ మదన్ లాల్ తీవ్రంగా స్పందించారు. ఆర్థిక నష్టాలు, ఐసీసీ చర్యల భయంతోనే పాకిస్థాన్ చివరికి భారత్‌తో ఆడేందుకు ఒప్పుకుందని ఆయన వ్యాఖ్యానించారు. ఇతర దేశాల ఒత్తిడి కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నారన్న వాదనను ఆయన ఖండించారు.

ఈ అంశంపై ఐఏఎన్ఎస్‌తో మాట్లాడిన మదన్ లాల్, మ్యాచ్ ఆడకపోతే పాకిస్థాన్‌కు భారీ ఆర్థిక నష్టం వాటిల్లేదని తెలిపారు. జరిమానాలు మాత్రమే కాకుండా ఐసీసీ నుంచి కొన్ని సంవత్సరాల పాటు నిషేధం ఎదురయ్యే అవకాశం కూడా ఉండేదని పేర్కొన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పాక్ యూటర్న్ తీసుకుందని ఆయన విశ్లేషించారు.

బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాలు ఒప్పించడం వల్లే భారత్‌తో ఆడేందుకు సిద్ధమయ్యామని పాకిస్థాన్ చెప్పడం సరైన కారణం కాదని మదన్ లాల్ అన్నారు. ప్రతి దేశం తమ నిర్ణయాలను స్వతంత్రంగా తీసుకోవాలని, మొదట తీసుకున్న నిర్ణయాన్ని మార్చుకోవడం వేరే విషయం కానీ ఇతరులపై బాధ్యత నెట్టడం సరికాదని వ్యాఖ్యానించారు. పాకిస్థాన్ ఆర్థిక పరిస్థితి బలంగా లేని సమయంలో అంతర్జాతీయ మ్యాచ్‌లను వదులుకోవడం క్రికెట్‌కు నష్టం కలిగిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వివాదం వల్ల భారత్‌కు గానీ, ఐసీసీకి గానీ ఎలాంటి నష్టం లేదని, నష్టపోయేది పాకిస్థాన్ మాత్రమేనని మదన్ లాల్ ఘాటుగా విమర్శించారు.

# స్మృతి మందాన సంపాదన షాకింగ్.. కోట్లలో స్టార్ బ్యాటర్ ఆదాయం



ముంబై ఫిబ్రవరి 10 మన గళం : భారత మహిళా క్రికెట్ జట్టులో స్టార్ ఓపెనర్‌గా గుర్తింపు పొందిన స్మృతి మందాన ఆటతీరుతో పాటు ఆదాయ పరంగానూ సెన్సేషన్‌గా నిలుస్తోంది. 2025 మహిళల క్రికెట్ వరల్డ్‌కప్‌లో కీలక పాత్ర పోషించిన ఆమె, ప్రస్తుతం మహిళా క్రికెట్‌లో అత్యధిక ఆదాయం పొందుతున్న ఆటగాళ్లలో ఒకరిగా కొనసాగుతోంది. స్థిరమైన ప్రదర్శనలు, భారీ అభిమాన వర్గం, బ్రాండ్ విలువ పెరగడం వంటి కారణాలతో ఆమె సంపాదన గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం స్మృతి మందాన ఆదాయ వనరుల్లో బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్, మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్), అంతర్జాతీయ మ్యాచ్ ఫీజులు, అలాగే ప్రముఖ బ్రాండ్ల ప్రకటనలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. బీసీసీఐ గ్రేడ్ 'ఏ' కాంట్రాక్ట్ ద్వారా ప్రతి ఏడాది సుమారు రూ.50 లక్షలు అందుకుంటుండగా, మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఒక్క సీజన్‌కే దాదాపు రూ.3.4 కోట్ల వరకు ఆదాయం పొందుతోంది. అదనంగా స్పోర్ట్స్, ఫిట్‌నెస్, ఫ్యాషన్ బ్రాండ్లతో ఉన్న ఒప్పందాల ద్వారా కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతోంది. సోషల్ మీడియా వేదికలపై భారీ ఫాలోయింగ్ కలిగిన మందాన, బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా ప్రముఖ కంపెనీలకు మొదటి ఎంపికగా మారింది. మహిళా క్రికెట్‌కు పెరుగుతున్న ఆదరణ కూడా ఆమె మార్కెట్ విలువ పెరగడానికి కారణమవుతోంది. ఆటలో స్థిరత్వం, ఆకర్షణీయమైన బ్యాటింగ్ శైలి, అభిమానులతో దగ్గర సంబంధం ఆమెకు అదనపు ప్లస్‌గా మారాయి.

నిపుణుల అంచనాల ప్రకారం 2026 నాటికి స్మృతి మందాన నెట్ వర్త్ రూ.34 కోట్ల నుంచి రూ.40 కోట్ల మధ్య ఉండొచ్చని భావిస్తున్నారు. క్రీడల్లో ప్రతిభతో పాటు వ్యక్తిత్వంలోనూ ప్రత్యేక గుర్తింపు సంపాదించిన ఆమె, మహిళా క్రికెట్ అభివృద్ధికి ప్రేరణగా నిలుస్తూ యువ క్రీడాకారిణులకు ఆదర్శంగా మారుతోంది.

# టీ20 ప్రపంచకప్: ఆటగాళ్లకు బీసీసీఐ కీలక ఆదేశాలు..



న్యూఢిల్లీ ఫిబ్రవరి 10, మన గళం : టీ20 ప్రపంచకప్ సందర్భంగా భారత క్రికెటర్లకు బీసీసీఐ కీలక ఆదేశాలు జారీ చేసింది. టోర్నమెంట్ సమయంలో ఆటగాళ్లతో పాటు వారి కుటుంబ సభ్యులు జట్టు హోటళ్లలో బస చేయడానికి అనుమతి ఉండదని బోర్డు స్పష్టం చేసింది. ఆటగాళ్ల ఏకాగ్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి.

కుటుంబ సభ్యుల అనుమతిపై టీమ్ మేనేజ్‌మెంట్ స్పష్టత కోరినప్పటికీ, బోర్డు తన నిబంధనల ప్రకారమే ముందుకు సాగాలని నిర్ణయించింది. అయితే కుటుంబ సభ్యులు రావాలనుకుంటే, జట్టు ఏర్పాట్లకు భిన్నంగా స్వతంత్రంగా బస చేసుకోవచ్చని సమాచారం. బీసీసీఐ నియమావళి ప్రకారం 45 రోజులకు మించిన పర్యటనల్లో గరిష్ఠంగా 14 రోజులు, అంతకంటే తక్కువ వ్యవధి ఉన్న టూర్‌లలో 7 రోజులు మాత్రమే కుటుంబ సభ్యులకు అనుమతి ఉంటుంది.

గతంలో జట్టు పేలవ ప్రదర్శనల నేపథ్యంలో ఈ విధానాన్ని కఠినంగా అమలు చేయాలని బోర్డు నిర్ణయించినట్లు తెలుస్తోంది. 2024లో న్యూజిలాండ్‌తో స్వదేశంలో జరిగిన టెస్ట్ సిరీస్‌లో 0-3 తేడాతో ఓటమి, అలాగే 2024-25లో ఆస్ట్రేలియాలో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో 1-3 తేడాతో పరాజయం అనంతరం ఆటగాళ్ల దృష్టి పూర్తిగా ఆటపైనే ఉండేలా చర్యలు చేపట్టినట్లు సమాచారం. పర్యటనల సమయంలో ఆటగాళ్లు తప్పనిసరిగా జట్టుతోనే ప్రయాణించాలనే నిబంధనను కూడా బీసీసీఐ అమలు చేస్తోంది.

ప్రస్తుతం టీ20 ప్రపంచకప్‌లో భారత్ అమెరికాపై విజయంతో శుభారంభం చేసింది. తదుపరి మ్యాచ్ ఢిల్లీలో నమీబియాతో జరగనుండగా, ఈ నెల 15న కొలంబో వేదికగా పాకిస్థాన్‌తో కీలక పోరుకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో బీసీసీఐ నిర్ణయం జట్టు ప్రదర్శనపై ఎలాంటి ప్రభావం చూపుతుందో ఆసక్తిగా మారింది.


Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.